క్లుప్తంగా

5న చలో ఢిల్లీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివకుమార్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

లేపాక్షి వస్తువులపై తగ్గింపు ధరలు

కడప కల్చరల్ : లేపాక్షి ఎంపోరియంలోని వస్తువులను తగ్గింపు ధరలకు అందజేస్తున్నామని షోరూం ఇన్‌చార్జి మేనేజర్ వీపీ వెంకటేశన్ తెలిపారు. ప్రత్యేక ఆఫర్ కింద షోరూంలోని కొండపల్లి, ఏటికొప్పాక, రోజ్‌వుడ్, మెటల్ బొమ్మలు, ఫొటో ఫ్రేమ్‌లు, లెదర్ పప్పెట్లు, ల్యాంప్ షేడ్లుతోపాటు ఆకర్షణీయమైన చేనేత వస్త్రాలను కూడా 10 నుంచి 40 శాతం వరకు తగ్గింపు ధరలపై అందజేస్తున్నామన్నారు. ఈనెల 31 వరకు ఈ ఆఫర్ ఉంటుందని, ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు షోరూం పనిచేస్తుందని తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహాత్ మదరసాలో ఆదివారం ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ప్రైమ్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య బృందంతోపాటు స్థానిక యునాని వైద్య నిపుణులు కూడా సేవలు అందించారు. సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్, కార్యదర్శి హిదాయతుల్లా, సహాయ కార్యదర్శి అర్షద్, కోశాధికారి జిలానీ, గౌరవ సలహాదారులు బాబుభాయి పాల్గొన్నారు.

కేఎస్ఆర్ఎంలో ..

కడప ఎడ్యుకేషన్: నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి ద్వితీయ కుమారుడి యదార్థరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, సాయి నర్సింగ్‌హోమ్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యరాలు మాధవి, ఆర్థోపెడిక్ సర్జన్ సుబ్రమణ్యారావు రోగులను పరీక్షించి మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

కడప కల్చరల్: కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక మిస్బా మూవీ ఆధ్వర్యంలో యువతీ యువకులు, చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అలాగే శిల్పారామం సందర్శనకు వచ్చిన చిన్నారులు కూడా తమ నృత్యాలతో విశేషంగా అలరించారు. ఈ సందర్భంగా పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. వారు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులను అందుకున్నాయి. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ముగిసిన గంగమ్మ జాతర



గాజుల అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. నాల్గవ ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ సురేష్‌కుమార్ ఏర్పాట్లను చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీకేదిన్నె ఎస్ఐ అరుణ్‌రెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారు.

31న బండలాగుడు పోటీలు

పులివెందుల టౌన్ : ఈనెల 31వ తేదీన శ్రీరామ నవమిని పురస్కరించుకుని దేశవు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులతో కలిసి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా దేశవు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నామని.. ఈ పోటీలలో పాల్గొనేవారు ఎద్దుల యజమానులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866599455, 9441135977 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు. బలిజ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవ ప్రయోజనానికి కళలే పరమావధి

వైవీయూ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి

వైవీయూ: విశ్వమానవ ప్రయోజనానికి కళలే పరమావధి అని, కళ అంటే భావప్రకటన అని, అది సంగీతమైనా, చిత్రలేఖనమైనా, నాట్యమైనా భావవ్యక్తీకరణమే ప్రయోజనమని వైవీయూ మానవీయశాస్త్రాల డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీహరి డిగ్రీ కళాశాలలో వైవీయూ లలితకళల విభాగం కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఏదో ఒక కళ నేర్చుకోవడంలో దృష్టి పెట్టినవారి ఎదుగుదలలో, వ్యక్తిత్వంలో తప్పనిసరిగా మార్పు కనిపిస్తుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లలితకళల విభాగాధిపతి డా. కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ ప్రాంతీయంగా ఉండే కళాకారులను దృష్టిలో ఉంచుకుని కోర్సులను ఏర్పాటు చేశామన్నారు. కళల వలన మానవుని మేథస్సు పెరుగుతుందని, మానవత్వం అభివృద్ధి చెందుతుందన్నారు. లలితకళల విభాగం ఆచార్యులు డా. మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కళలు విశ్వజనీనమైనవని, విశ్వవ్యాప్తమైనవని, సమాజాన్ని ఉత్తమ మార్గంలో నడిపిస్తాయని తెలిపారు. వైవీయూ పాలకమండలి సభ్యులు, శ్రీహరి డిగ్రీ కళాశాల అధినేత జి. సుబ్బారెడ్డి , వైవీయూ కూచిపూడి నృత్యకళాకారిణి ఎం. కామేశ్వరి, కర్నాటక సంగీత నిపుణులు జి. వెంకటేశ్వరరావు, కీబోర్డు ప్లేయర్ వలసిగాండ్ల సుబ్బరాయుడు మాట్లాడారు. లలితకళల విభాగం అధ్యాపకులు డా.కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, వలసిగాండ్ల సుధాకర్, సి.హెచ్. వెంకటేష్, కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు కోర్సుల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'వైఎస్ సిలార్' అవార్డు ఏర్పాటు చేద్దాం

– మాజీ ఎమ్మెల్సీ షేక్ హుసేన్ సత్యాగ్ని పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ షేక్ హుసేన్ సత్యాగ్ని

కడప కల్చరల్ : ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు వైఎస్ సిలార్ పేరిట ఏటా ఒక అవార్డు ఏర్పాటు చేసేందుకు ఆయన శిష్యవర్గంతోపాటు కళాభిమానులంతా ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్సీ షేక్ హుసేన్ సత్యాగ్ని పిలుపునిచ్చారు. శ్రీ నవ్యకళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ సిలార్ సంస్మరణగా ఆదివారం స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆయన కుమారుడు సాయిబాబా కుటుంబ సభ్యులతో కలిసి కళాకారులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సత్యాగ్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ సిలార్‌కు రంగస్థలమంటే ప్రాణమని, జీవితాన్ని నాటకానికే అంకితం చేశారని కొనియాడారు. హోంగార్డుగా, నటునిగా జిల్లా నలుమూలల నాటకాలు ప్రదర్శించి దానికి గల ఔన్నత్యాన్ని మరింత పెంచారన్నారు. ఏటా ఉత్తమ రంగస్థల కళాకారుడికి సిలార్ పేరిట అవార్డు ఏర్పాటు చేస్తే తనవంతుగా సహకరిస్తామన్నారు. ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్, ప్రముఖ విద్యావేత్త ఎం.వివేకానందరెడ్డి సభాధ్యక్షులుగా మాట్లాడుతూ సిలార్ రంగస్థల విలువలను కాపాడిన ఉత్తమ నటుడని, ప్రభుత్వ పథకాల ప్రచారానికి కూడా రంగస్థలాన్ని ఉపయోగించారని గుర్తు చేసుకున్నారు. శాంతినికేతన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎలియాస్‌రెడ్డి మాట్లాడుతూ సిలార్ జీవితాంతం నాటకం గురించే ఆలోచించారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు డాక్టర్ సొహైల్, అమీర్‌బాబు, సంఘమిత్ర సిరాజుద్దీన్, ఖాదర్‌బాష, సిలార్ శిష్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సిలార్ శిష్యులు అభిమానులు, రంగస్థల ప్రముఖులకు సిలార్ పేరిట ఉగాది పురస్కారాలు అందజేశారు.

వక్కలపేటలో ఘర్షణ

కడప అర్బన్: కడప నగరంలోని వక్కలపేటలో ఆదివారం సాయంత్రం గంగయ్య, నాగన్న డబ్బు విషయమై ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు.

డీఈఓకు వినతి



డీఈఓతో చర్చిస్తున్న పీఎస్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: సెలవు రోజుల్లో తరగతులు, స్టడీ అవర్లు నిర్వహించరాదని, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆప్షనల్ హాలిడేస్ ప్రకటించాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి కోరారు. ఈ విషయమై ఆదివారం డీఈఓ రాఘవరెడ్డి తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డెన్న, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఈఓకు శుభాకాంక్షలు

ఇటీవల డీఈఓగా బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డిని ఆదివారం పలు ఉపాధ్యాయ సంఘాలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గేట్ ఫలితాల్లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: గేట్ (గ్రాడ్యుయేట్ ఆటిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్) ఫలితాల్లో కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో తమ ప్రతిభ చాటారు. కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్యాచ్ పూర్వపు విద్యార్థి భావన 841 స్కోర్‌తో 42వ ర్యాంకుతో సత్తా చాటారు. అలాగే బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న ఎస్‌వి సాయి పవన్ 345 స్కోర్‌లో 11,847 ర్యాంకు, మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న వంశీధర్ 269 స్కోర్‌తో 15,189 ర్యాంకును సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

శ్రీవారి సేవకులు చక్కగా సేవలందించాలి



మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం



పాల్గొన్న శ్రీవారి సేవకులు

టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

ఒంటిమిట్ట(రాజంపేట) : కోదండరాముని బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవంలో పాల్గొనే శ్రీవారి సేవకులు చక్కగా సేవలందించి విజయవంతం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం కోరారు. ఆదివారం స్థానిక టీటీడీ సమావేశ భవనంలో శ్రీవారి సేవకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5న జరిగే కోదండరాముని కల్యాణం రోజున సాయంత్రం 4 గంటల నుంచి భక్తులు గ్యాలరీలోకి వస్తారన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదం, అక్షింతలు, పసుపు, కుంకమ, వాటర్ ప్యాకెట్లు ఉంచిన బ్యాగును అందించాలన్నారు. శ్రీ వారి సేవకులు ఈ బ్యాగులను భక్తులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా ఓపికతో వ్యవహరించాలన్నారు. శ్రీవారి సేవకులు ఎక్కడ సేవ చేయాలో నిర్ణయించి అందుకు సంబంధించి పాసులను ముందే ఇస్తామని జేఈఓ చెప్పారు. సేవ కోసం వచ్చే వారికి ఆహారం ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. టీటీడీలో శ్రీవారి సేవ విభాగానికి ఎంతో గౌరవం, గుర్తింపు ఉన్నాయన్నారు. టీటీడీ పీఆర్ఓ రవి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో సేవలందించడంలో శ్రీవారి సేవకులు పాత్ర ప్రధానమైనదన్నారు. శ్రీవారి సేవకులపై టీటీడీకి అపార నమ్మకం ఉందన్నారు. సమావేశంలో ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ కుమార్, టీటీడీ చీఫ్ ఇంజనీరు నాగేశ్వరరావు, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, శ్వేత డైరక్టర్ ప్రశాంతి, వీజీఓ మనోహర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రాజంపేట రూరల్ : సిద్దవటం మండలం వంతాటిపల్లికి చెందిన రైతు శ్రీనివాసులుయాదవ్ ఇటీవలే విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆకేపాటి శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియలకు రూ.20వేల తన సొంత నగదును అందజేశారు. అదే విధంగా వారి కుటుంబం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు అందజేశారు. అలానే కృష్ణ లాడ్జి యజమాని ఎం.శ్రీనివాసులు యాదవ్, జేవీ కృష్ణారావు యాదవ్, ఎం.వెంకటరత్నం యాదవ్, టి.సుబ్రమణ్యంయాదవ్(కువైట్), బ్యాంకు సుబ్బయ్య యాదవ్, పి.నరసింహులు యాదవ్‌లు రూ.50వేలు నిధులు సేకరించి ఆదివారం మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో మృతుడి కుమారుడికి జెడ్పీ చైర్మన్ నగదును అందజేశారు.

పేద కుటుంబానికి నగదు, నిత్యావసరాలు..

పుల్లంపేట : మండలానికి చెందిన పాల అమర్నాథ్, ఆయన సతీమణి రెడ్డమ్మలు అనంతంపల్లికి చెందిన జయరాం అనే పేద కుటుంబానికి రూ. 5 వేలు నగదు, నిత్యావసర వస్తువులను తన స్నేహితుడు గోపినాథ్ చేతులు మీదుగా అందజేశారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ సర్జరీలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న డాక్టర్ సంతోష్ ఆనంద్

కడప రూరల్: సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ శస్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నట్లు చెన్నై అపోలో హాస్పిటల్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు సంతోష్ ఆనంద్, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు అండ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ వెంకటేష్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక అరుణాచల ఆస్పత్రిలో వారు విలేకరులతో మాట్లాడారు. కడపలోని అరుణాచల ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, నెఫ్రాలజీ విభాగాలకు సంబంధించి రొబొటిక్ సర్జరీ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ రొబొటిక్ సర్జరీలు దేశంలో రెండేళ్ల నుంచి దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో మహానగరాలకే పరిమితమైన ఈ సౌకర్యం ఇప్పటి నుంచి అరుణాచల ఆస్పత్రి ద్వారా జిల్లా ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. రొబొటిక్ సర్జరీ ద్వారా రోగికి ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. నొప్పి, కోత తక్కువగా ఉండడంతో పాటు త్వరగా కోలుకోవడానికి వీలుంటుందన్నారు. రోగులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అరుణాచల ఆస్పత్రి డైరెక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ చెన్నై అపోలో ఆస్పత్రి వైద్యుల సహకారంతో లభించే ఈ వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు.

ఘనంగా ముద్దల పండుగ



పాతసంగటిపల్లెలో సిరిబండితో జాతర నిర్వహిస్తున్న గ్రామస్తులు



బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



పూజలందుకుంటున్న గంగమ్మ అమ్మవారు

కమలాపురం: గంగమ్మ.. మమ్మల్ను చల్లగ చూడవమ్మా అంటూ భక్తులు స్థానిక మార్కెట్ వీధిలో వెలసిన గంగమ్మతల్లిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గంగమ్మకు బోనాలు తీసుకొచ్చి చల్ల ముద్దలు ఏర్పాటు చేసి, జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కోగటం, కె.అప్పాయపల్లె, జీవంపేట, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, పొడదుర్తి, ఎర్రబల్లె, నల్లింగాయపల్లె, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, సంబటూరు, జంభాపురం తదితర గ్రామాలలో ప్రజలు ఘనంగా ముద్దల పండుగ చేసుకున్నారు. బంధువులు, సన్నిహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

పెండ్లిమర్రి : మండలంలోని నాగాయపల్లె, కారపురెడ్డిపల్లె, కొండూరు, కొత్తసంగటిపల్లె, మర్రిమాకులపల్లె, రేపల్లె, పగడాలపల్లె, చెన్నంరాజుపల్లె, గంగులయ్యగారిపల్లె, మాచునూరు తదితర గ్రామాలల్లో ప్రజలు ముద్దల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామదేవతలు గంగమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మలకు భక్తులు పూజలు చేసి ఇళ్ళల్లో చల్లముద్దలు ఏర్పాటు చేసుకుని జంతువులను బలి ఇచ్చి విందు భోజనాలు అరగించి బంధు మిత్రులతో సంతోషంగా గడుపుకున్నారు. పాత సంగటిపల్లె గ్రామంలో గ్రామ దేవత జాతర ఎద్దులచే సిరిబండి కట్టి వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందో బస్తు నిర్వహించారు.

22 నుంచి శ్రీ సీతారాముల వసంత నవరాత్రులు

కడప కల్చరల్ : స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో ఈనెల 22న ఉగాది నుంచి 30న శ్రీరామ నవమి వరకు వసంత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఆలయ కార్యాలయంలో విలేకరులకు ఈ విషయాలు వెల్లడించారు. 23న సాయంత్రం వేద పండితులు చక్రవర్తుల నాగాంజనేయశర్మ పంచాంగ పఠనం ఉంటుందన్నారు. 23న ఉదయం స్త్రీ, పురుషులకు రామాయణంపై క్విజ్, సాయంత్రం జిల్లాలో రామాయణం రచించిన కవులు, రచయితల సమ్మేళనం, సత్కార కార్యక్రమం ఉంటాయన్నారు. 24న ఉదయం స్త్రీ, పురుషులకు రామాయణంపై ధారణ పోటీ, సాయంత్రం రామాయణం నుంచి భక్తిసంగీతలహరి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 25న ఉదయం మహిళలకు సంప్రదాయ వంటల పోటీ, సాయంత్రం రమణి రామాయణం నాటక రూపకాన్ని ప్రదర్శిస్తారన్నారు. 26న ఉదయం బాలబాలికలకు రామాయణం నాకెందుకు నచ్చింది అన్న అంశంపై వక్తృత్వ పోటీ ఉంటుందని, సాయంత్రం బాలబాలికలకు రామాయణంలోని వివిధ పాత్రల వేషధారణ పోటీ నిర్వహిస్తామని వివరించారు. 27న ఉదయం గంటలకు బాల బాలికలకు రామాయణంపై క్విజ్, 28న ఉదయం మహిళలకు సరదా ఆటల పోటీలు, 29న ఉదయం రామాయణంలో నాకు నచ్చిన సన్నివేశం అనే అంశంపై పెద్దలకు వక్తృత్వ పోటీ ఉంటుందన్నారు. 27 నుంచి 29వ తేది వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు కడప చిన్మయమిషన్ అధ్యక్షులు స్వామి తురియానంద సరస్వతి, శ్రీమద్ రామాయణంపై ప్రవచనం చేయనున్నట్లు తెలిపారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లను అందజేస్తున్న జమా అతె ఇస్లామి హింద్ కడపశాఖ ప్రతినిధులు

కడప కల్చరల్ : స్థానిక బెల్లంమండివీధిలోని మదరసా–యే–జహారాలో ఆదివారం జమా అతె ఇస్లామి హింద్ కడపశాఖ ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ కిట్లు అందజేశారు. పవిత్ర రంజాన్ మాసం రాకను పురస్కరించుకుని స్థానికంగా కొందరు పేదలను గుర్తించి బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఫాతిమా మెడికల్ కళాశాల కార్యదర్శి ఏక్యూ జవ్వాద్, దంత వైద్యులు డాక్టర్ షేక్ నజీముద్దీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కడపశాఖ అధ్యక్షులు ఎస్.రియాజ్‌బాష, ఎంపీజే అధ్యక్షులు వీఎస్‌జే అబ్దుల్లాఖాన్, రాష్ట్ర సభ్యులు సయ్యద్ ఇందాదుల్లా హుసేనీ తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవ..మహాత్ముల తోవ



ఆరోగ్య భవన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రామకృష్ణ మిషన్ కడపశాఖ కార్యదర్శి స్వామి భీతిహరానంద, ఇతర అతిథులు

కడప కల్చరల్ : లోకంలో మహానుభావులందరూ మానవ సేవయే సూచించారని రామకృష్ణ మిషన్ కడపశాఖ కార్యదర్శి స్వామి భీతిహరానంద అన్నారు. కడప రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నగర శివార్లలోగల రామకృష్ణ వానప్రస్థాశ్రమంలో దాతల సహకారంతో నిర్మించిన సీసీ రోడ్డు, ఆరోగ్య భవన్‌లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎల్ఐసీ రిటైర్డ్ మేనేజర్ తోట చంద్రశేఖర్‌రెడ్డి తన సతీమణి తోట రామలక్ష్మి జ్ఞాపకార్థం సీసీ రోడ్డు నిర్మాణానికి విరాళం ఇచ్చారని తెలిపారు. ఆరోగ్య భవన్ నిర్మాణం కోసం దాతలు ఎంసీ నాగిరెడ్డి, ఎ.వెంకట లక్షుమ్మ, డి.రామిరెడ్డి, చంద్రమోహన్, ఇతర ఆశ్రమ వాసులు విరాళాలు ఇచ్చి సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సేవా సమితి కార్యదర్శి బీరం శివరామిరెడ్డి, మిషన్ స్వామిజీలు స్వర్గానంద, వినోద్, రాహుల్ మహరాజ్, ఉద్యోగ, పెన్షనర్ సంఘాల ప్రతినిధులు రామ్మూర్తినాయుడు, నాగమునిరెడ్డి, శంకర్‌రావు, సుధీకర్, రఘునాథరెడ్డి, అవధానం శ్రీనివాస్, అక్బర్, రాజు, జయచంద్ర పాల్గొన్నారు.

వైభవంగా మాచుపల్లె గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో ఆదివారం ప్రజలు గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు జాతరను పురస్కరించుకొని మాచుపల్లెలోని వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి గృహానికి వచ్చారు. తరువాత వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వైఎస్ ఎంపీపీ ఏర్పాటు చేసిన విందులో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మదుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వల్లిచాన్, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గోపాలస్వామి, నీలకంఠారెడ్డి, కె.వి. సుబ్బయ్య, క్రిష్ణచైతన్య, నాయకులు రాజారెడ్డి, వావిల్ల శ్రీనివాసులరెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, మునిరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేల ఇమాంబి ఉరుసు





ప్రత్యేక అలంకరణలో ఇమాంబి దర్గా, కవ్వాలి పోటీలను వింటున్న భక్తులు

తొండూరు : మల్లేల శ్రీసయ్యద్ ఇమాంబి ఉరుసు మహోత్సవాన్ని ఆదివారం దర్గా కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కడప జిల్లా నుంచే కాకుండా అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కర్నూలు తదితర జిల్లాలతోపాటు కర్నాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి చదివింపులు చల్లించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి ఖవ్వాళి పోటీలు ఘనంగా నిర్వహించారు. బెంగుళూరుకు బెల్గాంకు చెందిన ఆర్షియన్ నాజ్, అలాగే ముంబాయికి చెందిన మెయిన్ నాజ్‌ల ఖవ్వాళి పోటీలు నిర్వహించారు. ఉరుసు కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్గా కమిటీ, సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ హనుమంతులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పంట నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళతా

ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: మండలంలోని తంగెడు గ్రామంలో శనివారం కురిసిన వర్షం, గాలులకు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పంటలను ఆదివారం పులివెందుల ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. దెబ్బతిన్న పంటలకు ఎంతనష్టం జరిగిందో నివేధిక తయారు చేసి త్వరగా అందించాలన్నారు. నివేధిక అందగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లి రైతులకు పంట నష్ట పరిహారం అందేందుకు కృషి చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. చీనీనిమ్మ, సన్న నిమ్మ 200 ఎకరాలు, అరటి 50 ఎకరాలు, నూగు పంట 300 ఎకరాల్లో దెబ్బతినిందని రైతులు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 100కు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వీరపునాయునిపల్లె మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తంగెడుపల్లె ఎంపీటీసీ వీరభద్రారెడ్డి, ఆర్టికల్చర్ అధికారి రెడ్డెయ్య, పలువురు రైతులు ఆయన వెంట ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన...

వల్లూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. మండల పరిధిలోని లేబాక గ్రామ పొలాలో దెబ్బతిన్న వరి పంటను కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. పంట నష్టం వివరాలను గురించి రైతులతో ఆరా తీశారు. రైతులకు న్యాయం చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

37.4మి.మీ. వర్షపాతం

కమలాపురం: మండలంలో 37.4 మి.మీ. వర్షపాతం నమోదు అయినట్లు మండల తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. తుఫాన్ కారణంగా శనివారం రాత్రి భారీగా వీచిన గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఈ వర్షం కురవడంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.